బరితెగిస్తున్న ఇసుకాసురులు


ఇసుక తవ్వేందుకు ఉంచిన యంత్రం


పొట్టేపాళెంలో ఇసుకను తరలించే వాహనంపై కప్పిన నల్లటి పట్ట

- పొట్టేపాళెం, కోడూరుపాడు ప్రాంతాల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- రాత్రి పది దాటితే ట్రాక్టర్లలో జోరుగా రవాణా
- టీడీపీ నేతల దందా

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం, కోడూరుపాడు పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. టీడీపీ నేతల అండదండలతో కొందరు చోటా నేతలు ట్రాక్టర్లు, మినీ వాహనాల్లో ఇసుకను తరలిస్తున్నారు. రాత్రి పది దాటితే ఆయా ప్రాంతాల్లో వేగంగా వెళ్తున్న ఈ వాహనాలతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఎవరికీ అనుమానం రాకుండా..

పొట్టేపాళెంలోని రీచ్‌లో ఇసుకను రాత్రి వేళ కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. ఉదయం సైతం తరలించేందుకు కొత్త ఆలోచనకు తెరదీశారు. మినీ వాహనంలో లోడ్ చేసి, దానిపై నల్లటి పట్టను కప్పారు. చూసేవారికి ఇసుక అనే అనుమానం రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో ఈ వ్యవహారం నిరంతరం సాగుతోంది. పొట్టేపాళెం, అరుంధతీయపాళెంలోని 12 అడుగుల రోడ్లపై ఈ వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అధికార పార్టీ నేతలు కావడంతో వీరిని ప్రశ్నించేందుకు ఎవరూ సాహసం చేయడం లేదు.

నిరంతరం 50 ట్రాక్టర్లలో..

నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడులోని బాలాజీ సన్ సిటీ లేఅవుట్లో ట్రాక్టర్లతో ఇసుకను అర్ధరాత్రి డంపింగ్ చేస్తున్నారు. పల్లిపాడు – కోడూరుపాడు మధ్యలోని రీచ్‌లలో అక్రమంగా తవ్వకాలు జరిపి ఈ తంతు సాగిస్తున్నారు. నిరంతరం దాదాపు 50 ట్రాక్టర్లతో వ్యవహారం సాగుతోంది. లేఅవుట్లోని ఇసుకను జేసీబీ సాయంతో టిప్పర్‌లోకి వేసి, నగరంలోని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

క్లుప్తంగా

పలువురికి వైద్య పరీక్షలు



నెల్లూరు(అర్బన్): వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని నగరంలోని జెండావీధిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏబీ ఫౌండేషన్ సహకారంతో రవి చెస్ట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. డాక్టర్ పోకల రవి, గైనకాలజిస్ట్ లక్ష్మి, ఆర్థోపెడిక్ తులసీరామ్, ఈఎన్టీ నాగేంద్ర వైద్య సేవలందించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. దాదాపు 270 మందికి వైద్యసేవలను అందించామని రవి తెలిపారు.

విజయకుమార్‌రెడ్డికి సత్కారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన ఆనం విజయకుమార్ రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం సత్కరించారు. 28వ డివిజన్‌కు చెందిన పలువురు నేతలు కలిసి శుభాకాంక్షలను తెలియజేశారు.

మర్యాదపూర్వకంగా..


కాకాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

వెంకటాచలం : ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఆదివారం వెంకటాచలం మండలం నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి అభినందనలు తెలిపారు. నెల్లూరు నగరంలోని కాకాణి నివాసంలో కలిసి శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

అక్టోబర్ 3 నుంచి శరన్నవరాత్రులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి శరన్నవరాత్రులు అక్టోబర్ 3వ తేదీ నుంచి మొదలవుతాయని ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 12వ తేదీ వరకు వివిధ పూజా కార్యక్రమాలు, అమ్మవారిక ప్రత్యేకాలంకారాలు జరుగుతాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

వధూవరులకు ఆశీర్వాదం


వివాహ వేడుకలో ప్రసన్న, కాటంరెడ్డి తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని కేవీఆర్ ఫంక్షన్ హాల్లో నగర పంచాయతీ ఐదో వార్డు కౌన్సిలర్ షాహుల్ కుమారుడు సల్మాన్ వివాహం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌ఈఐఎల్ ఎనర్జీకి రెండు అవార్డులు



ముత్తుకూరు : ముత్తుకూరు మండలం, నేలటూరులోని ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు రెండు ప్రతిష్టాత్మకమైన అవార్డులు దక్కినట్లు సంస్థ ప్రతినిధులు ఆదివారం వెల్లడించారు. ఇందులో భాగంగా ఆసియన్ హౌస్ కీపర్స్ అసోసియేషన్, క్లీన్ ఇండియా జర్నల్ సంయుక్తంగా లక్నోలో నిర్వహించిన ఇంటర్నేషనల్ హౌస్ కీపర్స్ సమ్మిట్–2024లో ఈ సంస్థకు 'బెస్ట్ హౌస్ కీపింగ్ ప్రాక్టీసెస్(ఇండస్ట్రియల్ కేటగిరీ) విభాగంలో మొదటి అవార్డును అందుకుంది. సీనియర్ జనరల్ మేనేజర్ అల్తాఫ్ షేక్ ఈ అవార్డును అందుకున్నారు. అలాగే, చెన్నైలో జరిగిన 'ఐఎస్ఎఫ్‌హెచ్ఆర్ఏ అవార్డ్స్–2024'లో ఈ ఎనర్జీ సంస్థ 'గోల్డ్ అవార్డు' అందుకుంది. సీనియర్ మేనేజర్ పొడుగు నాగేశ్వరరావు ఈ అవార్డును అందుకున్నారు. సంస్థ సీఈఓ రాఘవ్ త్రివేది సిబ్బందిని అభినందించారు.

మూడు నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలను అక్టోబర్ మూడు నుంచి 12 వరకు నిర్వహించనున్నామని దేవస్థాన పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మద్దూరు సుబ్బారావు పేర్కొన్నారు. మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను దేవస్థానంలో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. విశేష పూజా కార్యక్రమాలను రోజూ నిర్వహించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు. దేవస్థాన పాలకమండలి చైర్మన్ సాదా నాగయ్య, ఈఓ దర్గయ్య, నగిరి చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, కోటయ్య, శేఖర్, నారాయణస్వామి, తాతా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(బృందావనం): సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అక్టోబర్ మూడు నుంచి 12 వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇక్కట్లు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. మహోత్సవాల నిర్వహణకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని ఆర్డీఓ మలోల అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. 19 మందితో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా ఒట్టూరు సురేంద్రయాదవ్‌ను నియమించారు. తొలుత ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైమ్): దేశంలో నూతనంగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్నెస్), భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్నెస్సెస్), భారతీయ సాక్ష్య (బీఎస్) తదితర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా సూచించారు. నూతన చట్టాలు, సైబర్ నేరాల నియంత్రణ చర్యలు, మత్తు మాదకద్రవ్యాల వినియోగంతో సంభవించే దుష్పరిణామాలపై జాకీర్‌హుస్సేన్‌నగర్‌లోని ఎస్వీఆర్ చిల్డ్రన్స్ అకాడమీలో స్థానికులకు ఆదివారం అవగాహన కల్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. మత్తు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వీటి బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఊర్లో సమయంలో ఎల్‌హెచ్ఎమ్మెస్ సేవలను వినియోగించుకోవాని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 లేదా 94407 96306, 94407 96310 నంబర్లకు సమాచారమివ్వాలని తెలిపారు.

గోవధ నిరోధక చట్టాన్ని అమలు చేయాలి


గోపూజ చేస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరు(బృందావనం): గోవు ఘోష.. విను గోవిందా.. కార్యక్రమాన్ని మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్రంలోని గోశాలల్లో గోవులు అనుభవిస్తున్న బాధలకు నిరసనగా చేపట్టిన ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ నేతలు సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, మిడతల రమేష్ మాట్లాడారు. గోవధ నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, గో సంపదను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. తొలుత దేవస్థానంలోని గోశాలలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నేతలు సురేంద్రనాథ్‌రెడ్డి, హర్షకుమార్, నాగలక్ష్మి, పద్మ, సాయిశ్రీనివాసులు, నరేష్‌కుమార్, అల్లూరు నాగేంద్రసింగ్, యాకసిరి ఫణిరాజు, రవికుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల అసోసియేషన్ సమావేశం


దిక్సూచిని ఆవిష్కరిస్తున్న సభ్యులు

నెల్లూరు (టౌన్): నగరంలోని ఐఎంఏ హాల్లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. భౌతికశాస్త్రంలో పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు రూపొందించిన దిక్సూచిని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఎస్సీఈఆర్టీ ప్రొఫెసర్ అరుణ ఆవిష్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కల్యాణ్‌కుమార్, జుల్ఫికర్ అలీ, అధ్యక్షుడిగా ఫణికుమార్, సెక్రటరీగా సురేఖ, కోశాధికారిగా ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా శ్రీరాములు, మస్తానయ్య, పీవీఎస్ మూర్తి, రాధిక ఎన్నికయ్యారు.

ఆరోగ్యానికి నడక ఎంతో ఉపయోగం


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(అర్బన్): ఆరోగ్యానికి నడక ఎంతో ఉపయోగకరమని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని వాకథాన్ కార్యక్రమాన్ని కిమ్స్ స్పెషాల్టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గాంధీబొమ్మ నుంచి కిమ్స్ ఆస్పత్రి వరకు నిర్వహించిన ర్యాలీని ఎస్పీ, కార్డియాలజిస్ట్ శ్రీనివాసరాజు ప్రారంభించారు. కాగా కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు వైద్య సిబ్బందికి అభినందనలను ఆస్పత్రి ఈడీ గిరినాయుడు తెలియజేశారు. గుండె డాక్టర్లు సాహెబ్‌పీర్, నాగరాజు, నరేష్‌కుమార్, మెడికల్ కో ఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాకాణికి అభినందనల వెల్లువ



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అభినందనలను తెలియజేసేందుకు నగరంలోని ఆయన నివాసానికి అభిమానులు పోటెత్తుతున్నారు. ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

వేడుకగా గ్రంథావిష్కరణ

నెల్లూరు(బృందావనం): టౌన్‌హాల్ ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో డాక్టర్ ఉడాలి నరసింహశాస్త్రి వైద్యుష్యం గ్రంథావిష్కరణ సభను నెల్లూరు వర్ధమాన సమాజ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. తొలుత నరసింహశాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, చింతలపాటి పూర్ణానంద శాస్త్రి, తూమాటి సంజీవరావు, ఉడాలి మహాలక్ష్మి, వెంకటనరసింహరవి, అశ్వత్థనారాయణ, వర్ధమాన సమాజ కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు (టౌన్): నూతన ప్రభుత్వం ఏర్పడి మూడున్నర నెలలు దాటుతున్నా.. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పట్టించుకోవడం లేదని పీఆర్టీయూ జిల్లా గౌరవాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వెంకటరాజు, తిరుమలయ్య ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 20 శాతానికి తగ్గకుండా మధ్యంతత భృతి, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు సత్కారం



నెల్లూరు (టౌన్): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీవీనగర్‌లోని వెంకటేశ్వర విద్యాలయంలో 30 మంది ఉపాధ్యాయులను నెల్లూరు బాలభవన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, కోఆర్డినేటర్ రామ్మోహన్, ఉపాధ్యాయులు నూనె నారాయణ, సుధాకర్, కరస్పాండెంట్ శివకుమార్, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ అవసరం

- ఏఎస్పీ సౌజన్య


ఏఎస్పీని సత్కరిస్తున్న ప్రతినిధులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలకు ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరమని ఏఎస్పీ సౌజన్య పేర్కొన్నారు. న్యూ మాంక్స్ కుంగ్ ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని నగరంలోని ఏకేనగర్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. సమాజంలో నేర స్వభావం పెరుగుతున్న కొద్దీ అది స్త్రీల జీవితాలపై ప్రభావం చూపుతోందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆడపిల్లలు ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. తద్వారా తమను తాము రక్షించుకోవచ్చని పేర్కొన్నారు. ఆత్మరక్షణ విద్యలపై పోలీస్ శాఖ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. అనంతరం ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఏఎస్పీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యూ మాంక్స్ కుంగ్ ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ రాజ శిఖామణి, డాక్టర్ దామోదరన్, రాఘవ, దినేష్ వర్మ, స్వామి, రాజశేఖర్, రాఘవ, కాశిరాజన్, విజయ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎఫ్‌ఓ చంద్రశేఖర్ సేవలు అభినందనీయం



నెల్లూరు(అర్బన్): డీఎఫ్ఓ చంద్రశేఖర్ సేవలు ఎనలేనివని ఇన్‌చార్జి డీఎఫ్ఓ ధర్మరాజు పేర్కొన్నారు. అనంతపురానికి బదిలీ అయిన చంద్రశేఖర్‌కు ఆత్మీయ వీడ్కోలు సభను కొత్తూరు సమీపంలోని నగర వనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాతో తనకు విడదీయరాని అనుబంధం ఏర్పడిందని చెప్పారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన రేంజర్లు, డిప్యూటీ రేంజర్లతో పాటు సెక్షన్, బీట్ ఆఫీసర్లు, సిబ్బందికి కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం ప్రకాశం జిల్లా కనిగిరి రేంజ్‌కు వెళ్తున్న ఉదయగిరి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉమామహేశ్వర రెడ్డిని సత్కరించారు. సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ శ్రీనివాసులు, రేంజ్ అధికారులు మాల్యాద్రి, రవీంద్రబాబు, శేఖర్, రాజేంద్రప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న రామ్‌కుమార్

నెల్లూరు(అర్బన్): ముందస్తు వైద్య పరీక్షల ద్వారా ఆరోగ్య భద్రతకు బాటలు వేసుకోవచ్చని నారాయణ స్పెషాల్టీ ఆస్పత్రి ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ రామ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ గుండె వ్యాధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టోన్‌హౌస్‌పేటలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రూ.12 వేలయ్యే పరీక్షలను తమ ఆస్పత్రిలో రూ.మూడు వేలకే హెల్త్ చెకప్ రూపంలో అందిస్తున్నామని వివరించారు. అనంతరం హాస్పిటల్ డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ అరుణ్‌కాంత్, ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులను సత్కరించారు. కార్డియాలజీ కన్సల్టెంట్ తిలక్‌కుమార్‌రెడ్డి, చలువాది శరణ్‌కుమార్, సత్యనారాయణ, జోన్ ట్రెజరర్ సత్యనారాయణ, జోన్ డైరెక్టర్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి అభినందన



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి నగరంలోని ఆయన నివాసంలో పార్టీ నేతలు అభినందనలను తెలియజేశారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలను అందజేశారు. 6, 14వ డివిజన్ల పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాకర్స్‌కు మెగా వైద్య శిబిరం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వాకర్స్‌కు మెగా వైద్యశిబిరాన్ని స్టేడియం వాకర్స్ అసోసియేషన్, ఎనెల్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించారు. వాకర్స్‌కు బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో పరీక్షలను ఎనెల్ హాస్పిటల్ అధినేత కులారి నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిపారు. వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అనంతరామారావు, వెంకటసురేంద్రబాబు, కోశాధికారి అరిగెల సాయిరామ్, మాజీ అధ్యక్షుడు రంగారావు, రఘురామ్ ముదిరాజ్, బాసం శేషగిరిరావు, గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతినాయుడు, గోవిందయ్య, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆమంచర్లలో కొలువైన గంగమ్మ తల్లి జాతరను ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అర్జీలను అందజేయండి

నెల్లూరు(బారకాసు): నగరంలో నెలకొన్న సమస్యలపై అర్జీలను ప్రజలు అందజేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం వరకు అర్జీలను స్వీకరించనున్నామని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంగీత విభావరి నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవ సంబరాలను సోమవారం నిర్వహించనున్నామని సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సినీ సంగీత విభావరిని సాయంత్రం నుంచి రాత్రి వరకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

కాళ్లకు రక్తప్రసరణ తగ్గితే ఇబ్బందే

నెల్లూరు(అర్బన్): షుగర్, బీపీ ఉన్న వారితో పాటు వృద్ధుల కాళ్లకు రక్తప్రసరణ తగ్గితే ఇబ్బందులు తప్పవని, ఒక్కోసారి కాలిని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని నెల్లూరు వాస్కులర్ సెంటర్ అధినేత డాక్టర్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సండే మార్కెట్ సమీపంలోని ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. సమస్యలొస్తే వాస్కులర్ డాక్టర్లను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు.